క్లుప్తంగా

విశేష అలంకరణలో సంతోషిమాత



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో శనివారం అమ్మవారి జన్మో త్సవం పురస్కరించుకుని ఆలయంలో ఉద యం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు సంతోష్ మహరాజ్, దత్త మహరాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం, వ్రతాలు నిర్వహించామ న్నారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చి అమ్మవా రిని దర్శించుకుంటున్నారు.

శిథిలావస్థలో ఓపెన్ జిమ్



శిథిలావస్థకు చేరుకున్న జిమ్ పరికరాలు

రామచమచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో జిమ్‌లోని పరికరాలతో వ్యాయామం చేసే వారు. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఓపెన్ జిమ్‌లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపకర్మ వేడుకలు



ఉపకర్మ పూజలు చేస్తున్న వేద పండితులు

జహీరాబాద్ టౌన్: బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో శ్రావణి ఉపకర్మ వేడుకలను సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని హనుమాన్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జంధ్యాలు వేసుకున్నారు. వేద మంత్రోచ్ఛరణలతో గాయత్రి మాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్‌రావు, శ్రీనివాస్ జోషి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయండి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపాలిటీలో ఐదు గ్రామ పంచాయతీలను విలీనం చేయడంతో పట్టణం విస్తీర్ణం పెరిగి రద్దీగా మారింది. శనివారం ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణం పెద్ద వాణిజ్య కేంద్రంగా ఏర్పాటు కావడంతో షాపింగ్ మాల్స్, పరిశ్రమలు అవతరించాయి. దీంతో రహదారిపై రాకపోకలు సాగించడం కష్టంగా మారిందన్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ ఏర్పడుతోంది. ప్రభుత్వం స్పందించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని కోరారు.

శ్రావణ మాస పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న దంపతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని న్యాల్‌కల్, టేకూర్ తదితర గ్రామాల్లోని రామలింగేశ్వర, శ్రీమల్లికార్జున స్వామి దేవాలయాల్లో నిత్యం శ్రావణమాస పూజలు కొనసాగుతున్నాయి. ప్రతిరోజు ఉదయం ఆలయాల్లో దంపతులు స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఈ పూజలు నెల రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

అనురాగం.. అప్యాయత..

సెల్ఫీ విత్ రాఖీకి విశేష స్పందన

అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ. శనివారం జిల్లా వ్యాప్తంగా తమకు జీవితాంతం రక్షణగా ఉండాలని రాఖీని వేడుకగా జరుపుకొన్నారు. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫీ విత్ రాఖీ ఫొటోలకు విశేష స్పందన వచ్చింది. తమ సోదరులకు స్వీట్లు తినిపించి రాఖీలు కట్టి ఫొటోలు పంపించారు.













రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఏసీపీ శ్రీనివాస్‌కుమార్‌కు రాఖీలు కడుతున్న మహిళా పోలీసులు



జిన్నారం(పటాన్‌చెరు): సోదరులకు రాఖీ కడుతున్న సంజన



మునిపల్లి: మాజీమంత్రి హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న మీనాక్షి







పటాన్‌చెరు టౌన్: సోదరులకు రాఖీ కడుతున్న అక్కాచెల్లెలు



హత్నూర: అన్నకు రాఖీ కడుతున్న చిన్నారులు



వట్‌పల్లి(అందోల్): సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి



సదాశివపేట పోలీస్‌స్టేషన్‌లో..



పటాన్‌చెరు: రక్షాబంధన్ వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కుటుంబీకులు



జహీరాబాద్: ఎమ్మెల్యే మాణిక్‌రావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

సురక్షితంగా చేర్చడమే పరమావధి



భోజనం ప్యాకెట్లను అందజేస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి పరమావధి కావాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. శనివారం ఖేడ్ రాజీవ్ చౌక్ సమీపంలో బస్టాప్ వద్ద ఆర్టీసీ పర్యవేక్షణ కమిటీ పనితీరును పర్యవేక్షించారు. రాఖీపౌర్ణిమ సందర్భంగా బస్సుల్లో విపరీతమైన రద్దీ నెలకొనడంతో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి భోజనాల ప్యాకెట్లు, డబుల్ డ్యూటీ చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు వెజ్ బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. ఆయన వెంట అసిస్టెంట్ డీఎం నర్సింహులు, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఖేడ్‌లో రేపు భస్మహారతి

నారాయణఖేడ్: మండలంలోని భక్తమార్కండేయ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని సోమవారం సా. 6 గంటలకు భస్మహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మలమంచి గురురాజ శర్మ, ఆలయకమిటీ బాధ్యులు తెలిపారు. ఆలయంలో అత్యంత మహిమాన్వితమైన శక్తిమంతమైన, బ్రహ్మసూత్రం కల్గిన ఏకైక శివలింగం ఆలయంలో ఉందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుడి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

రైతుబీమాకు దరఖాస్తుల స్వీకరణ

జహీరాబాద్ టౌన్: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొంది భూభారతి పోర్టల్‌లో డిజిటల్ సైన్ చేసుకున్న రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ ప్రదీప్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు దరఖాస్తుకు అర్హులన్నారు. రైతు పట్టా పాస్‌పుస్తకం , ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ రైతుబీమా దరఖాస్తు ఫారంతో స్వయంగా వెళ్లి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి ఈ నెల 12లోగా అందజేయాలని సూచించారు.

గురుకులంలో ఆదివాసీ దినోత్సవం



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలోని బాచేపల్లి మినీ గిరిజన బాలికల గురుకులంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు గిరిజనుల సంప్రదాయ దుస్తులు ధరించి ఆటాపాటలతో అలరించారు. విద్యార్థినులకు రంగోలీ, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు కవిత, టీచర్లు పాల్గొన్నారు.

జిన్నారం మున్సిపాలిటీలోని ..

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మున్సిపాలిటీలోని గిరిజన బాలుర గురుకులంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీల పోరాటయోధుడు కొమరం భీమ్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ వెంకటయ్యతో కలిసి ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు రంగోలి, చిత్రలేఖనం, ఉపన్యాస వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రిన్సిపాల్ వెంకటయ్య చేతులమీదుగా అందజేశారు.

మార్కండేయ ఆలయంలో హోమం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మార్కండేయ ఆలయంలో శనివారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రభిషేకం నిర్వహించి గాయత్రీ పూజ చేసి హోమం చేశారు. పూజల అనంతరం స్వామివారి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. మార్కండేయ మందిరం నుంచి ప్రారంభమైన ఊరేగింపు హనుమాన్ మందిరం రోడ్డు, నాగుల కట్ట పురవీధుల్లో సాగింది. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు మనోహర్, సుధీర్ బండారీ, పండరి, నాందేవ్, శ్రీనివాస్, సుదర్శన్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



గాయత్రీ హోమం నిర్వహిస్తున్న పూజారులు

నూతన యజ్ఞోపవీత ధారణ



జంధ్యం ధరిస్తున్న కులబంధువులు

సదాశివపేట(సంగారెడ్డి): రక్షాబంధన్ పండుగ సందర్భంగా శనివారం లోపలికోట హనుమాన్ మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యజ్ఞోపవిత ధారణ ఆలయ పూజారి చంద్రశేఖర్ వేద మంత్రాలచే నూతన జంధ్యధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. లోపలికోట కులబంధువులు నూతన జంధ్యం ధరించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, పోల మనోహర్, సిద్ధిరాములు, అశోక్, మధు, పద్మగణేశ్, మల్లేశం, సురేష్, లింగం, శ్రీకాంత్, పోల సంగమేశ్వర్ విజయ్, నరేష్, తుల్జారాం, లోపలికోట కులబంధువులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నూలు పౌర్ణమి

నారాయణఖేడ్: ఖేడ్ మండలం వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం నూలు పౌర్ణమిని ఘనంగా నిర్వహించుకున్నారు. పురోహితులు వెంకటేశం పంతు లు ఆలయంలో గాయత్రిదేవి, గణపతిపూజ, చంద్రమౌళీశ్వరుడికి మహా అభిషేకం, మహాహారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పద్మశాలీలు ఆచార సంప్రదాయ ప్రకారం వేదమంత్రోచ్చారణల మధ్య యజ్ఞోపవీతధారణలు చేశారు. పద్మశాలీ సంఘం బాధ్యులు, కులపెద్దలు పాల్గొన్నారు.

రామచంద్రాపురం పట్టణంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు తడుక నాగభూషణం మాట్లాడుతూ... రాఖీ పౌర్ణమి రోజు యజ్ఞోపవీత కార్యక్రమం ప్రతిఏటా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ మార్కండేయ చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు నరసింహులు, గోవర్ధన్, విజయ్ , వీరేశం, వెంకటేష్, లక్ష్మణ్, విట్టల్, హరి, శ్రీధర్ పాల్గొన్నారు.

11 వరకు స్పాట్ అడ్మిషన్లు

జహీరాబాద్ టౌన్: రంజోల్ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 11 వరకు దరఖాస్తులను స్వీకరణ గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సువర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఆటోమొబైల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఖాళీలను స్పాట్ అడ్మిషన్‌లు ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. మొదటి రెండు రౌండ్లలో సీట్లు పొందని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌లో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 11న వరకు దరఖాస్తుల స్వీకరణ అదే మెరిట్ ఆధారంగా స్పాట్ అడ్మిషన్‌లు కల్పిస్తామన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు వెంట తీసుకొని రావాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బీఆర్‌ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన నాయిపేట రాములుకు మంజూరైన రూ.42 వేల చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో చెక్కు మంజూరయిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంతరావు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి ,ప్రభు ,కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత కీలకంగా వ్యవహరించాలి



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత కీలకంగా వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ అన్నారు. శనివారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఝరాసంగంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవేంద్రతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధన్న పాటిల్, శంకర్ పాటిల్, వేణుగోపాల్ రెడ్డి, రాజ్‌కుమార్ స్వామి, సంగమేశ్వర్, అశ్రఫ్ అలీ, మల్లికార్జున్ పాటిల్, బక్కప్ప, నవాజ్‌రెడ్డి లియాఖత్ అలీ, రాజేందర్ సింగ్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

జహీరాబాద్ పట్టణంలో..

జహీరాబాద్: పట్టణంలోని సుభాష్‌గంజ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

మురుగు గుంటల్లా రోడ్లు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నారాయణఖేడ్: చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారే రహదారులు, వర్షం నీటితో చెరువులను తలపించే రాజీవ్‌చౌక్ ప్రాంతంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సీపీఎం ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయా కాలనీల్లో పర్యటించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా కాలనీల్లోని సీసీ రోడ్లు బురదమయంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీవ్ చౌక్ ప్రాంతంతో పాటు ప్రధాన రహదారిని శాశ్వతంగా బీటీతో మరమ్మతులు చేయకుండా కంకరవేసి గోతులు పూడ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. రూ.20కోట్లు పట్టణ అభివృద్ధికి మంజూరయ్యాయని చెబుతున్నారే తప్ప మురికి కాల్వల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు మాత్రం చేపట్టడం లేదని మండిపడ్డారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించని పక్షంలో ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొటారి నర్సింహులు, గణపతి, మహిపాల్, విజయ్, రఘు ఉన్నారు.

నులిపురుగుల నివారణ చర్యలు

- రేపు జాతీయ నులిపురుగుల దినోత్సవం
- మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): చిన్నపెద్ద అనే తేడా లేకుండా అనేక మంది నులిపురుగుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం నులిపురుగులను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 11 నుంచి నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీకి అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో 4,06,494 మందికి మాత్రలు పంపిణీ

జిల్లాలో 1504 అంగన్‌వాడీ కేంద్రాలు, 1696 పాఠశాలలు, 88 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో 4,06,494 చిన్నారులు, విద్యార్థులు చదువుతున్నారు. వారు నులిపురుగుల వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ఈనెల 11 నుంచి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఇటీవల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల వారందరికీ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

రెండు రోజులు...

2016 నుంచి ప్రారంభమైన నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహిస్తూ వస్తున్నారు. ఏడాదిలో రెండు సార్లు మాత్రలను పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 11న ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్లనున్నారు. 1నుంచి 2 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సగం అల్బెండజోల్ మాత్రను చూర్ణం చేసి అందించాలి. 2 నుంచి 3సంవత్సరాల వయస్సు గల చిన్న పిల్లలకు ఒక మాత్రను చూర్ణం చేసి తాగు నీటిలో అందించాలి. 3 సంవత్సరాల పైబడిన వారందరు మాత్రను నమిలి మింగాలి. మాత్రలను ఇంటికి ఇవ్వకుండా మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు వేసుకునేలా చూడాలని సిబ్బందికి అధికారులు సూచించారు. మాత్రలు వేసుకోని చిన్నారులు, విద్యార్థులకు ఈనెల 18న సిబ్బంది వారి ఇంటికి వెళ్లి మాత్రలను ఇస్తారని తెలిపారు.



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యులు (ఫైల్)

నులిపురుగుల ఇలా వస్తాయి..

పాదరక్షలు లేకుండా ఆటలు ఆడడం, తిరగడం, మరుగుదొడ్డిని వాడకుండా బహిరంగ మల విసర్జన చేయడం, చేతులు పరిశుభ్రంగా కడుకోకపోవడం, సరిగ్గా ఉడికించని ఆహారం తినడం తదితర కారణాల వల్ల నులిపురుగులు మనిషి శరీరంలోకి వ్యాపించి వ్యాధులను కలుగజేస్తాయి.

నివారణ చర్యలు

గోర్లు పెరగకుండా చూసుకోవాలి. శుభ్రమైన నీటిని తాగాలి. తినే పదార్థాలపై మూతలు పెట్టాలి. పండ్లు, కూరగాయలను పరిశుభ్రమైన నీటితో కడగాలి. తినే ముందు చేతులను సబ్బుతో కడుక్కోవాలి.

అన్ని ఏర్పాట్లు చేశాం



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల 11న నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం. మాత్రల పంపిణీ రెండు రోజులు కొనసాగుతుంది.

– నాగనిర్మల డీఎంఅండ్‌హెచ్‌ఓ, సంగారెడ్డి